www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 20 నవంబర్ 2023



యుటిఎఫ్ నగర కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగర యుటిఎఫ్ శాఖ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నగర శాఖ కౌన్సిల్ సమావేశం స్థానిక ముత్తారావు యుటిఎఫ్ హోమ్‌లో ఆదివారం జరిగింది. యుటిఎఫ్ నాయకుడు ఎన్. రవిబాబు అధ్యక్షతన జరిగిన ఈ నూతన కమిటీ ఎన్నికకు ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి రమేష్ బాబు వ్యవహరించారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా వి కృష్ణమోహన్, అధ్యక్షులు జివి. అప్పారావు, సహాధ్యక్షులుగా ఎం.నరేష్, సహాధ్యక్షురాలుగా జెడి సుహాసిని, ప్రధాన కార్యదర్శిగా జెవిపి సుబ్బారావు, కోశాధికారిగా ఎస్.తేజ విజయకుమార్, ఆడిటర్‌గా సిహెచ్.వి.గంగాధరరావు, ఆఫీస్ బేరర్లుగా ఎం.శివాజీ, ఎండి అలీమ్ బేగ్, ఎన్.రవిబాబు, ఎన్.నాగేశ్వరరావు, డి.విజయ్ విక్టర్, కెబివిఎస్.ప్రసాదేశ్వరి, ఎం.మంగారాజీ, వివిపి.సత్యనారాయణ, కె.రత్నయ్య, వి.సుబ్బారెడ్డి, డి.వి.పద్మారావు, బికె.శ్రీనివాసరావు, ఎస్.రాజగోపాల్ ఎంపికయ్యారు.

విద్యా రంగ సమస్యలపై

శ్వేతపత్రం విడుదల చేయాలి

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్‌లో వక్తలు

ప్రజాశక్తి - కోరుకొండ

విద్యా రంగంలో నెలకున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మండలంలోని బూరుగుపూడి వద్ద గల ద్వారకామయి కళ్యాణ మండపంలో ఆదివారం యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. తెలుగుతల్లి జాతీయ పతాకాన్ని, ఎస్‌టియుఎఫ్, యుటిఎఫ్ పతాకాలను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ కేడర్లు, కుల, మతాలకు అతీతంగా యుటిఎఫ్ 50 ఏళ్లుగా నిలబడి, ఎన్నో ఆటు పోట్లను తట్టుకుందంటే దానికి కారణం యుటిఎఫ్ కార్యకర్తలు, నాయకత్వం యొక్క నిబద్ధతే అని అన్నారు. యుటిఎఫ్ నినాదాలైన అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహలను యుటిఎఫ్ కార్యకర్తలు ఆకళింపు చేసుకోవాలని సూచించారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాడు-నేడులో పాఠశాలలకు మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపరచడాన్ని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కానీ ఒకసారి రాష్ట్ర సిలబస్, తదుపరి సిబిఎస్‌ఇ, ఆ తరువాత ఐబి సిలబస్ అని చెబుతూ ఉపాధ్యాయులను గందరగోళంలో నెట్టిందని తెలిపారు. విద్యార్థుల ప్రాథమిక సామర్థ్యాలు సాధించడంలో వెనకబాటు పడడానికి వైసిపి ప్రభుత్వ విధానాలే కారణమని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల డ్రాప్ అవుట్లు పెరిగి పోయాయని ఆయన విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమ్మ ఒడి, నాడు-నేడు, జగనన్న గోరుముద్ద వంటి పథకాలతో వేలకోట్లు విద్య రంగానికి ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికి ఉపయోగపడిందని, ఆయా పథకాల వల్ల విద్యార్థులకు ఏమంత మేలు జరగలేదని విమర్శించారు. ఉపాధ్యాయుడికి స్వేచ్ఛ లేని విధానాన్ని రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఉపాధ్యాయ నియామకాలు లేకుండా విద్యారంగాన్ని ఎలా అభివృద్ధి పథంలో తీసుకుపోతారని ప్రశ్నించారు. ఉపాధ్యాయునికి ఖర్చు పెడుతున్న నిధులలో పారదర్శకత కొరవడిందని, విద్యారంగ ప్రణాళికలు ఉపాధ్యాయులతో, మేధావులతో, ఎంఎల్‌సిలతో చర్చించకుండా ఏకపక్షంగా అమలు చేస్తున్నారని అందుకే విద్య ప్రమాణాలు తిరుగమనంలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యారంగ స్థితిపై ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఊరిబడికి ఉరివేసిందని, గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల లేకుండా చేసిన ఈ ప్రభుత్వ తీరును ప్రజలు గ్రహించాలని సూచించారు. 4576 పాఠశాలలను 3, 4, 5 తరగతుల విలీనం పేరుతో ఉన్నత పాఠశాలలో కలిపిందని, ఫలితంగా 14వేలకు పైగా పాఠశాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని తెలిపారు. ఉపాధ్యాయులను భయపెట్టే విధంగా అధికారులను ప్రోత్సహించడం సరికాదన్నారు. ఉపాధ్యాయునికి, విద్యార్థికి స్వేచ్ఛ లేని వ్యవస్థ మంచి విద్యా ఫలితాలను ఇవ్వదన్నారు. ప్రతి సంవత్సరం మెగా డిఎస్‌సి వేస్తామని మేనిఫెస్టోలో చెప్పి అసలు డిఎస్‌సి లేకుండా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకోవడం మాని తక్షణమే డిఎస్‌సి వేసి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను అధిగమించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడుతూ కేవలం పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు సాధించగలమని, ఎంతటి మొండి ప్రభుత్వాలనైనా ప్రజా ఉద్యమాల ద్వారా గద్దె దించవచ్చున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, పెన్షనర్లు ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావడం ద్వారానే సమస్యలను పరిష్కరించికోగల్గుతామని, అందుకు ప్రతీ ఒక్కరూ సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను తీర్చడంలో యుటిఎఫ్ అగ్రభాగాన ఉందని, అలాగే ఇతర రంగాల్లోనూ ముందుండాలని సూచించారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆ కృషి ఫలించాలంటే ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్. అరుణకుమారి మాట్లాడుతూ యుటిఎఫ్ 50 ఏళ్ల స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంటుందని, రాష్ట్రంలో లక్షపై చిలుకు సభ్యత్వాన్ని కలిగిన ఏకైక ఉపాధ్యాయ సంఘంగా నిలబడిందని అన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిల గెలుపు యుటిఎఫ్ నిర్మాణం ద్వారానే సాధ్యమైందన్నారు. వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని ప్రకటించిన సిఎం మాట నిలబెట్టుకోలేకపోయారన్నారు. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాల పెరిగిపోయాయని, ప్రభుత్వ పాఠశాలలో నమోదు పడిపోయిందని, వీటన్నింటికీ ప్రభుత్వం అనుసరిస్తున్న తిరోగమన విధానాలే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బివి.రాఘవులు, అల్లూరి సీతారామరాజు జిల్లా కోశాధికారి కృష్ణ, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర వర్మ, కాకినాడ జిల్లా అధ్యక్షులు కెవివి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి, సహ అధ్యక్షురాలు వినాగమణి మాట్లాడారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.షరీఫ్, కార్యదర్శులు ప్రవేశపెట్టిన నివేదికలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, ఇన్‌సెట్‌లో ఎంఎల్‌సి ఐవి, ఎంఎల్‌ఎ రాజా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్

నూతన కమిటీ ఏకగ్రీవం

తూర్పు గోదావరి జిల్లా యుటిఎఫ్ నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా పి .జయకర్, ప్రధాన కార్యదర్శిగా ఎ.షరీఫ్, గౌరవ అధ్యక్షులుగా వి.శంకరుడు, సహాధ్యక్షులుగా ఐ.రాంబాబు సహాధ్యక్షురాలుగా ఎం.విజయ గౌరి, కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, కార్యదర్శులుగా జివి.వెంకటరమణ, ఎన్. రవిబాబు, రమేష్ బాబు, మనోహర్ కుమార్, డి.మనోజ్ కుమార్, కె.నాగభూషణం, ఎన్.భవాని, పి.శ్రీనివాసమూర్తి ఎన్నికయ్యారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

దుష్టచతుష్టయ పార్టీలను సాగనంపండి..

-పిసిసి మీడియా కమిటీ ఛైర్మన్ నర్రెడ్డి తులసి రెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అటు దేశాన్ని.. ఇటు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి పూర్తిగా దివాళా తీసే పరిస్థితికి తీసుకొచ్చారని రాజ్యసభ మాజీ సభ్యుడు, పిసిసి మీడియా కమిటి ఛైర్మన్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆరోపించారు. రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక కష్ణ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 106వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఇందిర చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన వంటి దుష్టచతుష్టయ పార్టీలను ఇంటికి సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 25కి 25 మంది ఎంపీలను గెలిపించండి ప్రత్యేక హోదా ఎందుకు రాదో చూస్తాను అంటూ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టారని, బీజేపీ ప్రత్యేక హోదా ఇవ్వబోమని ప్రకటించినా కనీసం వత్తిడి తేలేని దుస్థితిలో వైఎస్ జగన్ రెడ్డి ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విభజన చట్టంలోని హామీలు నెరవేర్చే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుందని, డిసెంబర్ 3న తెలంగాణ ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకోవడం ఖాయమన్నారు. ప్రాంతీయ పార్టీలకు ప్రత్యేక హోదా ఇచ్చే శక్తి లేదు.. తెచ్చే శక్తి లేదని వ్యాఖ్యానించారు. త్వరలోనే ఆరు సూత్రాలతో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శులు ముళ్ల మాధవ్, ఆకుల భాగ్య సూర్యలక్ష్మి, పిసిసి కార్యదర్శి బెజవాడ రంగారావు, తాళ్లూరి విజయకుమార్, పిసిసి సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు నిర్వహిస్తున్న 'అడుదాం ఆంధ్ర' ఆటల పోటీలకు నేటి నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్ ప్రారంభం అవుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, అర్బన్ రేంజ్ డిఐ .బి.దిలీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన వారు ఎవరైనా ఈ ఆటల్లో పాల్గొనవచ్చునని, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది మాత్రం అనర్హులన్నారు. కబడ్డీ, ఖోఖో, బ్యాట్మింటన్, వాలీబాల్, క్రికెట్ ఆటలు ఉంటాయన్నారు. గ్రామ స్థాయిలో డిసెంబరు 15 నుంచి 20 వరకు, మండల స్థాయి లో డిసెంబరు 21 నుంచి జనవరి 4 వరకూ, నియోజకవర్గ పరిధిలో జనవరి 5 నుంచి జనవరి 10 వరకూ, జిల్లా స్థాయిలో జనవరి 11 నుంచి జనవరి 21 వరకూ, రాష్ట్ర స్థాయిలో జనవరి 22 నుంచి 26 వరకు జరుగుతాయన్నారు. ప్రతి గేమ్‌కి 2 జట్లు ఉండాలని, కబడ్డీ 1 జట్టుకు 12 మంది, ఖోఖో 1 జట్టు కు 16 మంది, క్రికెట్ 1 జట్టుకు 16 మంది, వాలీబాల్ 1 జట్టుకు 12 మంది, బ్యాట్మింటన్ 1 జట్టుకు ఇద్దరు చొప్పున ఉండాలన్నారు.

గుంతల రోడ్డులో ధర్నా చేస్తున్న కుందుల

కుందుల ఆధ్వర్యంలో పాదయాత్ర

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమంలో భాగంగా ఆదివారం టిడిపి సీనియర్ నాయకులు కుందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో సత్యవాడ నుంచి చివటం రోడ్లను, సత్యవాడ- రెడ్డి చెరువు మూడు కిలోమీటర్ల గుంతల రోడ్లను ప్రజలకి తెలియజేస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపికి ఇతర రాష్ట్రాల వాళ్ళు పెట్టిన పేరు గుంతల ఆంధ్రప్రదేశ్ అని, అయితే కళ్ళకు గంతలు కట్టుకున్న వైసిపి పాలకులకు రోడ్లపై గుంతలు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.గుంతలు పడిన రోడ్లపై అనేక ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది వికలాంగులుగా మారిపోయారని అన్నారు. అయినా వైసిపి పాలకులకు కనికరం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్ల పాలనలో రోడ్ల మరమ్మతులు చేయని వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన ఉపాధ్యక్షులు గరిమెళ్ళ కొండలరావు, టిడిపి, జనసేన నాయకులు వాకలపూడి వెంకటరత్నం, అంబటి వెంకటరమణ, మద్దుకూరి రాధా, మల్లుల వీరబాబు, కరుటూరి లీలా కుమార్, దుర్గా రమేష్, అరిగెల నాగ సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

-వచ్చే ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పాలి
-రౌండ్ టేబుల్ సమావేశంలో పిలువురు పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి రాబోవు ఎన్నికల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ సత్తాను చాటి ఓడించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. నగరంలోని హోటల్ జగదీశ్వరిలో ఆదివారం స్థానిక ప్రభుత్వాల సాధికారతపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పిసిసి మీడియా కమిటీ ఛైర్మన్ ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ ఐదు వేల సంవత్సరాల నుంచి కొనసాగుతున్న గ్రామీణ పంచాయతీ వ్యవస్థను నేటి వైసిపి ప్రభుత్వం నిర్జీవం చేసిందని ఆరోపించారు. పంచాయతీ సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారన్నారు. ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నికైన సర్పంచులకు నిధులు, విధులు, అధికారాలు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి స్థానిక సంస్థల హక్కులను హరించే విధానాలను అమలు చేస్తున్నాయని అన్నారు. ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంతో అనేక పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడుతూ పంచాయతీల కనీస బాధ్యతలైన తాగునీరు సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి కార్యక్రమాలు సైతం నిర్వహించలేని దుస్థితిలోకి పంచాయితీలను వైసిపి ప్రభుత్వం నెట్టివేసిందని దుయ్యబట్టారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ సర్పంచులకు సచివాలయాల్లో స్థానం లేదని, వాలంటీర్లు వైసిపి కార్యకర్తలుగా వ్యవహరించడం వలన స్థానిక సంస్థల ప్రతినిధులకు విలువ లేకుండా పోతుందన్నారు. సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ల జీతాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం మానివేసి పంచాయతీలపై భారం మోపుతుందన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య భావాలను, పౌర హక్కులను కాలరాస్తూ పరిపాలించడం శోచనీయమన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

యుద్ధభేరి మహాసభకు తరలిరండి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఈ నెల 30న విజయవాడలో జరుగనున్న యుద్ధబేరి మహాసభకు పెద్దఎత్తున తరలిరావాలని ఎంఆర్‌పిఎస్ నాయకుడు చెట్టే సుజన రావు మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని కాల్దారిలో ఆదివారం యుద్ధభేరి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా వివిధ రాజకీయ పార్టీలు కమిటీలు, కమిషన్ల పేరుతో మాదిగ జాతిని మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వ పాలనలో మాదిగ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినా ఒక్క యువకుడికి రుణం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని గమనించి ఈ నెల 30న విజయవాడలో జరుగుతున్న మాదిగ, రెల్లి, డక్కలి ఉపకులాల యుద్ధ భేరి మహాసభకు పెద్దఎత్తున పాల్గొని గర్జించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.రాజు, జి.మహేష్, నుతంగి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లావ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు చివరాకురుకు చేరుకు న్నాయి. ఆదివారం పలు మండలాల్లోని శాఖ గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిం చారు. **రాజమహేంద్రవరం** టిటిఎం ఆధ్వర్యంలో ప్రతీ ఏటా నిర్వహించే హ్యూమనిస్ట్ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. వారం రోజులపాటు పుస్తక ప్రదర్శన, గ్రంథాలయోద్యమకారుల చిత్రపటాల ప్రదర్శన, వివిధ సాహితీ కార్యక్రమాలను నిర్వహించి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమాలకు సంస్థ అధినేత డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి. **కొవ్వూరు రూరల్** స్థానిక శాఖా గ్రంథాలయంలో 'మహిళ దినోత్సవం', 'దిశచట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్య్రక్రమంలో కొవ్వూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ భావన రత్నకుమారి, వైస్ ఛైర్‌పర్సన్ గండ్రోతు అంజలి దేవి, కొవ్వూరు పురపాలక సంఘం 11వ వార్డు సభ్యులు తోట ఉదయలక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు. **చాగల్లు** స్థానిక శాఖ గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి విద్యార్థులు పూలమాలవేసి నివాళు లర్పించారు. అలాగే చంద్రవరం శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి సుమన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. **గోపాలపురం** పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కాంపిటేషన్ పోటీలు ఆదివారం నిర్వహించినట్లు గ్రంథాలయ పాలకులు వెజ్జు సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీలలో వెలుగు స్కూలు, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, బీసీ వెల్ఫేర్ స్కూల్ ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలలో గెలుపొందినట్లు తెలిపారు. **తాళ్లపూడి** స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థినీలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీలకు దిశ చట్టంపై మహిళా పోలీసులు సీత, రమాదేవి, ఉష అవగాహన కల్పించారు. గ్రంథ పాలకుడు నరేష్ పాల్గొన్నారు. **దేవరపల్లి** స్థానిక శాఖా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు ధూళి పూడిరవీంద్ర, గ్రంథాలయ అధికారిణి జి.అనిత అభివృద్ధి కమిటి సభ్యులు నరహరిశెట్టి శ్రీహరి, బేతాల దుర్గాభవాని పాల్గొన్నారు.

కొవ్వూరులో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ప్రజాశక్తి - చాగల్లు, గోపాలపురం

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిక్షా పుల్లర్స్, కార్మికులకు స్వీట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, బి.రాంబాబు, గెల్లా భాస్కరరావు, మట్ట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 106వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. **గోపాలపురం** మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మట్టపర్తి రామ్మోహనరావు, నాయకులు గోపాలపురంలోని ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మట్టపర్తి రామ్మోహనరావు మాట్లాడుతూ ఆనాడు బ్యాంక్‌లను జాతీయం చేసి దేశాభివృద్ధికి నాంది పలికిన ఘనత ఇందిరాగాంధికే దక్కుతుందన్నారు. 20 సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి పథంలోనడిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి కుటుంబరావు, కౌలురి రతన్ రాజు, బాబాజిరావు, పిట్టా రామారావు, సూరిబోయిన సోమరాజు, వేగివడ నాగేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, పగడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

నైతిక విలువల్లేవు.. ఏ కమిటీలో వున్నాడంటావా? ఎథిక్స్ కమిటీలో...

వాలీబాల్ విజేతలుగా రాజమండ్రి, ధర్మవరం జట్లు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మురమండ గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో బబూ అండ్ షమ్మీ వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభం అయ్యింది. ఈ పోటీలను వైసిపి మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బబ్లూ షమ్మీ లకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే బబ్లూ షమ్మీ దివంగతులవటం చాలా బాధాకరం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు యువకులు విరివిగా నిర్వహించాలని, వ్యయప్రయాసలతో కూడుకున్న ఇటువంటి క్రీడలు ద్వారా సమాజానికి మంచి సందేశంతోపాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చని అన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ టోర్నమెంట్ లో వివిధ గ్రామాల నుంచి 24 టీమ్‌లు పాల్గొనగా రాజమహేంద్రవరం టీము విన్నర్‌గా నిలిచింది. విన్నర్ టీమ్‌కు రూ.20 వేలు నగదు బహుమతిని అందించారు. రన్నర్ టీమ్‌గా ప్రత్తిపాడు నియోజకవర్గం ధర్మవరం జట్టు నిలిచింది. ఈ టీమ్‌కు రూ.10 వేలు నగదు బహుమతిని అందించారు. ఆర్థికంగా సహకరించిన రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌కు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అయినవల్లి రుక్మిణి వెంకటేశ్వర్లు, ఎంపిటిసి మెల్లిమి మంగా గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నగదు బహుమతి చెక్కును అందుకుంటున్న రాజమహేంద్రవరం జట్టు

ఇసుక లారీలతో ప్రజల ఇక్కట్లు

ఇసుక ర్యాంపు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని బల్లిపాడు ఇసుక ర్యాంపు నుంచి తరలిస్తున్న లారీల వల్ల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని టిడిపి యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర అన్నారు. ఇసుక లారీల వల్ల కల్గుతున్న ఇబ్బందులపై ఆదివారం టిడిపి నాయకులు, కార్యకర్తలు రాంపు వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ ఇసుక లారీల కారణంగా ఏటిగట్టు రహదారితోపాటు బల్లిపాడుకు రెండువైపుల రహదారి లారీలతో నిండిపోయి ప్రజా రవాణాకు, అత్యవసర సర్వీసులకు ఆటంకంగా మారుతున్నాయిని అన్నారు. కార్తీకమాసం కారణంగా గోదావరి నదికి స్థానానికి వచ్చే మహిళలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇబ్బందులను ప్రశ్నిస్తున్న మహిళలపై ఇసుక మాఫియా సిబ్బంది వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.

ఆత్మ గౌరవ సభను అడ్డుకోవడం అన్యాయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

చిత్తూరు జిల్లాలో ఉద్యోగులు చేపట్టిన ఆత్మ గౌరవ సభకు అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం అన్యాయమని సిపిఎస్ ఉద్యోగుల తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానికంగా ఆదివారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. సిపిఎస్ ఉద్యోగుల సమావేశం అని ప్రకటన లేకపోయినప్పటికీ, ఉద్యోగుల ఒకచోటకు చేరుతున్నారంటే ప్రభుత్వం భయపడిపోతుందని అన్నారు. ఉద్యమం కాకుండా ఆత్మగౌరవ సభ నిర్వహించుకుంటున్నా పోలీసులు, ప్రభుత్వం అడ్డుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ప్రభుత్వం ఈవిధమైన రీతిలో ఉద్యోగులను అడ్డుకోవాలని అనుకుంటే రాబోయే కాలంలో తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

జాతీయ స్థాయి పోటీలో లోకేష్‌కు తృతీయ స్థానం

ప్రజాశక్తి - గోపాలపురం

కొవ్వూరుపాడు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి జొన్నాడ లోకేష్ ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 75 వ వార్షికోత్సవం డైమండ్ జూబ్లీ సందర్భంగా జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీలో తృతీయ స్థానం సాధించింది. ఢిల్లీలో ఈనెల 18, 19 తేదీలలో నిర్వహించిన పోటీల్లో జొన్నాడ లోకేష్ పాల్గొని హ్యాబిటేషన్ ఇన్ మూన్ అండ్ అదర్ ప్లానెట్స్ 2047అనే అంశంలో జాతీయస్థాయి పోస్టర్ ప్రజెంటేషన్ లో తతీయ స్థానంలో నిలిచినట్లు ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు తెలిపారు. రూ.20 వేలు బహుమతి వచ్చిందని చెప్పారు. జాతీయ స్థాయిలో కొవ్వూరుపాడు స్కూల్‌కు పేరు తెచ్చిన విద్యార్థినిని వారు అభినందించారు.

సాహిత్యంతో సామాజిక చైతన్యానికి ఆవంత్స కృషి

ప్రజాశక్తి-పిఠాపురం

సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ రచనలు చేశారని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సూర్యరయ్య విద్యానంద గ్రంథాలయంలో ఆవంత్స సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కళారత్న డాక్టర్ ఆవంత్స సోమ సుందర్ శతజయంతిని నిర్వహించారు. తొలుత సోమసుందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడారు. నిబద్ధత కలిగిన రచయితగా తెలుగు సామాజిక చరిత్రలో మార్పు కోసం సోమ సుందర్ రచనలు చేశారన్నారు. 82 ఏళ్ల పాటు సమసమాజ నిర్మాణం కోసం సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. సాహిత్య రచన, సాహిత్య ప్రచురణ, సాహిత్య ప్రోత్సాహం ఇలా విభిన్న రంగాల్లో సోమ సుందర్ చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ మనిషిని నడిపించేది ఒకటి సైన్స్ రెండోది సాహిత్యం అని కొడవటి గంటి కుటుంబరావు అన్న మాటలను గుర్తు చేశారు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావడంలో సోమ సుందర్ ఎంతో కృషి చేశారన్నారు. సాహిత్యానికి, కళలకు నేటి యువత దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువతరం సోమ సుందర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు అడుగులు వేయాలని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చెలికాన్ స్టాలిన్ మాట్లాడుతూ మతోన్మాదంపై, సామాజిక ఉగ్రతలపై కవిత్వం ద్వారా సోమసుందర్ పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రజా సమస్యల మీద స్పందించి రచనలు చేయటం సోమ సుందర్ ప్రత్యేకత అని అన్నారు. పిఆర్ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ భరత లక్ష్మి మాట్లాడుతూ ఆరుద్ర సాహిత్యానికి పరిచయం చేసింది సోమసుందర్ అని గుర్తు చేశారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు గనార కమ్యూనిస్టుగా జీవితాంతం బతికిన గొప్ప మహోన్నత వ్యక్తి సోమసుందర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సహృదయ మిత్రమండలి మహిళా కార్యదర్శి పి.పావని, యువ రచయిత డాక్టర్ కిలారి గౌరి నాయుడు అభ్యుదయ గీతాలను ఆలపించారు. అనంతరం రచయిత గౌరవ్ రచించిన 'ఆకాశమంత అక్షర మూర్తి డాక్టర్ ఆవంత్స సోమసుందర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ఉపాధ్యక్షులు డాక్టర్ గజరాజు సీతారామస్వామి, సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ట్రెజరర్ మేకా మన్మథరావు, ఆవంత్స విజయ శేషేంద్ర శాతకర్ణి, గట్టి శ్రీకష్ణదేవరాయలు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, తట్టవర్తి సుబ్బారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షు వి సత్యనారాయణ రెడ్డి, కొండేపూడి శంకర్రావు, సతీష్, శ్రీనివాసరావు, సాహిత్య అభిమానులు, కవులు, కళాకారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

నేరాలు ఘోరాలు

ఆగిఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బిక్కవోలు

ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో రంగంపేట మండలం ముకుందవరానికి చెందిన షేక్ మౌలానా(42) మృతి చెందాడని ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు. బిక్కవోలు మండలం కొమరిపాలెంలో ఒక రైస్ మిల్లులో మౌలనా కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం ఎప్పటిలానే కూలి పనికి వెళ్లాడు. పనిముగించుకుని ఇంటికి వెళతుండగా బలబద్రపురం శివారు మురళీమోహన్ గుడౌన్ వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఎంపిటిసి సభ్యురాలి మృతి

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని గిడజం గ్రామానికి చెందిన టిడిపి ఎంపిటిసి సభ్యురాలు ఈజ్జపు సూర్యకళ (26) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆమె కుటుంబికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఆన తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యానాం వార్తలు

ఫైనల్ మ్యాచ్‌కోసం స్క్రీన్లు ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

భారత్ మూడోసారి ప్రపంచ కప్పు గెలవాలని ఆశిస్తూ యానాంలో స్థానిక ఎంఎల్ఎ కార్యాలయం, కనకాల పేట, కొత్తపేట, తోట వారి వీధి తదితర గ్రామాల్లో ఆదివారం భారత్ - ఆస్ట్రేలియా మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు బిగ్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఈ ప్రపంచ కప్‌లో అన్ని మ్యాచ్‌ల్లో భారత్ విజయం సాధించిందని, అదే స్ఫూర్తితో కప్పు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి - యానాం

స్థానిక సర్వేపల్లి రాధాకష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20 నుంచి 22 వరకూ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నేషనల్ వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వరుగు భాస్కరరెడ్డి తెలిపారు. కళాశాల సెమీనార్ హాల్లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎజ మునిస్వామి, అన్నవరం సత్యవతి దేవి(ఎఎస్ఒ) మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనంతలక్ష్మి పాల్గొంటారన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషను చక్కగా మాట్లాడటం, అర్థం చేసుకోవడం, ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో వాటిపై అవగాహన కలిగించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలని తెలిపారు.

అకిరా కంటి వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురంలో పేరూరు వై.జంక్షన్ సమీపంలో బోసకుర్రు రోడ్డులో ఏర్పాటు చేసిన అకిరా కంటి ఆసుపత్రిని చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు కడలి ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడారు. తనకు విద్య నేర్పిన ప్రొఫెసర్ పేరుతోనే అకీర కంటి వైద్యశాలను స్థాపించానని తెలిపారు. అనంతరం ప్రసాద్ మాట్లాడారు. 37 ఏళ్లుగా కంటి వైద్యంలో అపార అనుభవంతో రాజమహేంద్రవరంలో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వీటిని విజయవాడ, అమలాపురం పట్టణాలకు విస్తరించారని తెలిపారు. 13 ఏళ్ల నుంచి యునైటెడ్ నర్సింగ్ హోమ్‌లో అకిరా వైద్య సేవలు అందించారని తెలిపారు. ఇప్పుడు పేరూరులో సొంత నూతన భవనంలోకి దీన్ని మార్చారని తెలిపారు. అత్యాధునిక నేత్ర వైద్య సేవలు ఇకపై జిల్లా పరిసర వాసులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దిన మిత్రులు, కన్సల్టెంట్ ఆర్కిటెక్ అండ్ ఇంటీరియర్ డిజైనర్ వి.షణ్ముఖ తేజ, శాతవాహన ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ అధినేత చెరుకూరి మురళీకృష్ణలకు చైర్మన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ నీలిమ, చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ హరిప్రియ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.ఇంద్రజిత్, మెడికల్ సూపరింటెండెంట్లు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ కడలి ప్రసాద్

సామాజిక సేవలతో ఔన్నత్యాన్ని చాటాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

సామాజిక సేవలతో ఔనత్యాన్ని చాటాలని కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ అన్నారు. అయినవిల్లి మండలం విలస గ్రామంలో శ్రీ కష్ణదేవరాయ కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పూర్వీకులను ఆదర్శంగా తీసుకొని కాపు సామాజిక వర్గంతో పాటు సమాజానికి విద్య, వైద్య, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లోన్నూ ప్రతి గ్రామంలో సేవలందించాలన్నారు. దానికి తన వంతు సహకారం కూడా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమారాధనలో జనసేన పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త మద్దా చంటిబాబు, కాపు నాయకులు నిమ్మకాయల జగయ్యనాయుడు, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సరిపెల్ల కనకరాజు, మట్టపర్తి వెంకటరమణ(పండు), చిరంజీవి ఫ్యాన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లా చిట్టిబాబు, దూడల ఫణి, ఎం.నాయుడు, కె.రాంబాబు, ఎ.దుర్గారావు, పి.ఆదినారాయణ, గంధం గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గారావు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రుకు చెందిన కండేపల్లి దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మతి చెందాడు. పేద కుటుంబం కావడంతో ఆతని భార్య లక్ష్మి కి ఆదివారం వాడపర్రుకు నవోదయ శెట్టిబలిజ సంఘం రూ.11వేల ఆర్థిక సాయంతో పాటూ 25 కేజీల బియ్యం అందించింది. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, గుత్తుల బాబ్జి, మట్టపర్తి శ్రీనివాసరావు, చప్పిడి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కడలి సాయిబాబు, మట్టపర్తి సుధీర్, కముజు సాయి, మట్టపర్తి కృష్ణ, పాటి బాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి-కాకినాడ

సహకార రంగంలో కొనసాగుతున్న వ్యవస్థలన్నీ సమర్థవంతంగా పనిచేస్తున్నప్పుడే తగిన సార్థకత చేకూరుతుందని ఎపి స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్ డిప్యూటీ రిజిస్ట్రార్, సహకార శిక్షణా కేంద్రం లెక్చరర్ వి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో కెసిబిఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాససత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సహకార వారోత్సవాల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో సహకార సొసైటీలు ఎలా అభివద్ధి చెందాలనే అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సహకార సంఘాలు పారదర్శకంగా పనిచేస్తూ సేవలు మెరుగుపరుచుకున్నాయన్నారు. ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సహకార రంగం బలోపేతంగా ఉంటే వాటి ఫలాలు ప్రజలకు అందుతాయన్నారు. అనేక సంఘాలు స్వయం సమద్ధి సాధించి వేల నుంచి లక్ష్యాల్లో పంట రుణాలు, ఇతర ప్రయోజనాలను అందించగలుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి నరల్ మేనేజర్ జి.ప్రవీణ్‌కుమార్, కెసిబిఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివబాలయోగి, మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితర ప్రముఖులు హాజరయ్యారు.

వైసిపి పాలనలో దళితులపై దాడులు

ప్రజాశక్తి-తాళ్లరేవు

వైసిపి పాలనలో రాష్ట్రంలో దళితులపై దాడులు అధికమయ్యాయని టిడిపి ఎస్‌సి సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెల్లి అశోక్, జిల్లా అధ్యక్షుడు బొద్దింక నారాయణరావు అన్నారు. టిడిపి ఎస్‌సి సెల్ విస్తతస్థాయి సమావేశం జక్కల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో అధ్యక్షుడు మోర్తా భైరవమూర్తి అధ్యక్షతన జైభీమ్ పేటలోని ప్రసాద్‌బాబు నివాసంలో ఆదివారం జరిగింది. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎస్‌సిలకు రావాల్సిన హక్కులను కాలరాస్తోందని, దళితులకు చెందిన 27 పథకాలను రద్దు చేసిందని, ఆ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి కార్పొరేషన్ నిధులను రద్దు చేసి యువకులకు అన్యాయంచేశారన్నారు. వైసిపి మళ్లీ అధికారంలోకి రాకుండా ప్రతి ఎస్‌సి సెల్ కార్యకర్తా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దున్నా గౌతమ్, బీర రాజేష్, బోయిడి వేణుగోపాల్, దాసరి వేణు, వాకపల్లి చిరంజీవి, మహాలక్ష్మి, తాతపూడి నాగేశ్వరరావు, దున్నా సుబ్రహ్మణ్యం, మురళీకష్ణ, వెంటపల్లి చంద్రమౌళి, ఉమామహేశ్వరి, గంటా రమేష్, గోపి, వస్కా రెడ్డి, ఐతే గోవింద్ పాల్గొన్నారు.

కోరంగి ప్రజల సమస్యలు పట్టించుకోండి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి విచ్చేస్తున్న మంత్రులు, అధికారులు కోరంగి పంచాయతీ ప్రజల సమస్యలను పట్టించుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ టి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. కోరంగి పంచాయతీ పరిధిలో ప్రజా సమస్యలపై పలుమార్లు జిల్లా, మండల స్థాయిలోని అధికారులకు అర్జీలు పెట్టినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. కొత్త కోరంగిలో బాలయోగి కళ్యాణ మండపం వద్ద మరో వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని, సీతారాంపురంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ పైపులైను వేయాలని, నిర్మించిన వాటర్ ట్యాంకులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. సీతారాంపురంలో బేస్మెంట్లు వేసిన సచివాలయం హెల్త్ క్లినిక్ భవనాలను వెంటనే నిర్మించాలన్నారు. జగనన్న కాలనీలో పట్టాదారులకు స్థలాలను అప్పగించాలి. కోరంగి గ్రామంలో సర్వే నంబర్ 276/1 నుంచి 276/31 వరకు సుమారు 60 ఎకరాల అసైన్ భూమిని పేదలకు పంచాలన్నారు. అదే గ్రామంలో 402/1 సర్వే నంబరు వృద్ధాశ్రమం పక్కనగల సుమారు నాలుగున్నర ఎకరాలు గ్రామకంఠం భూమిని, కోరంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గరలో ఉన్న సుమారు రెండు ఎకరాల గ్రామకంఠం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలన్నారు. పాత కోరంగి హౌరా వంతెన నుంచి కోరంగి పెద్ద వంతెన వరకు ఫార్మసీ కాలేజ్ వెనుక భాగం నుంచి మాజీ ఎంఎల్ఎ మండపేట చౌదరి చెరువుల వరకు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని సర్వే చేయించి పేద ప్రజలకు ఇవ్వాలని ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు.


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ కురసాల కన్నబాబు

దేశ నిర్మాణంలో అంబేద్కర్‌ది కీలకపాత్ర

ప్రజాశక్తి -కరప

దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కీలక భూమిక పోషించి భారత దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఆయన అగ్రగన్యుడుగా నిలిచారని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నడకుదురు గ్రామంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, గ్రామంలో తులసి నగర్‌లో రూ.90 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో వాటర్ ట్యాంక్, ఇంటింటికి కుళాయి కనెక్షన్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అంబేద్కర్ రాజ్యాంగం వల్లే నేడు హక్కులను పొందగలుగుతున్నామన్నారు. మహిళల హక్కుల కోసం మంత్రి పదవిని వదులుకున్న మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు వై.సుబ్బారావు, సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపిటిసి సభ్యులు బుచ్చిరాజు, పైలా రామతులసి, జవ్వాది సతీష్, సోని, చంద్రరావు, ఎం.గోవిందు, పాస్టర్ రాజకుమార్, సవిలే రాజేష్, సాదే రాఘవులు, సర్పంచ్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పులిమేరులో నంది విగ్రహం ప్రతిష్ఠాప

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం పులిమేరులోని గ్రామ సచివాలయం సమీపంలో ఆదివారం మాజీ సర్పంచ్ తుమ్మల సూర్య కష్ణమూర్తి దంపతులు నంది విగ్రహాన్ని ప్రతిష్ఠాపించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల నాని, బుల్లయ్య, దాడి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు. కార్తీకమాసం తొలి సోమవారం ఈనెల 20న పులిమేరులో సాయిబాబా గుడి వద్ద కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహిస్తున్నట్లు తుమ్మల నాని తెలిపారు.

రానున్నది సంకీర్ణ ప్రభుత్వమే...

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రానున్నది టిడిపి, జనసేనల సంకీర్ణ ప్రభుత్వమేనని మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. రామవరంలో పలువురు టిడిపిలో చేరారు. రామవరం మాజీఉప సర్పంచ్ అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారు టిడిపిలో చేరారు. జ్యోతుల నెహ్రూ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ టిడిపి, జనసేన కలయికతో ఆంధ్ర రాష్ట్రానికి ఒక నూతన వరవడితో పరిపాలన అందించేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తూ అనేక మంది వైసిపిని వీడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చరిత్రలో ఆలమూరుకు ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-ఆలమూరు

చరిత్రలో ఆలమూరుకు స్థానం ప్రత్యేకమైనదని, తెలుగు సాహిత్యంలో, ఆధ్యాత్మికంగా, రాజకీయంగా గానీ, చారిత్రాత్మకంగా ఆలమూరుకున్న విశిష్టతలు ఎనలేనివని, అవన్నీ భావితరాలకు అందేలా నేటితరం కృషి చేయాలని దూరదర్శన్ రిటైర్డ్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్, ప్రముఖ రచయిత సత్యవోలు సుందర సాయి అన్నారు. మండల కేంద్రానికి చెందిన 14 మంది రచయితల కథలతో రచయిత గొడవర్తి శ్రీనివాసు సంకలనం చేసిన 'ఆలమూరోళ్ల కథలు' సంపుటి స్థానిక గ్రామ దేవత రావులమ్మ అమ్మవారికి అంకిత కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యవోలు సుందరసాయి, ప్రముఖ కవి, శతక కర్త కామవరపు మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలమూరు చరిత్రలో కవులు, కథా రచయితలతో పాటు, ఎందరో ప్రముఖులు ఉన్నారన్నారు. వారందరి గురించి మరింత సమాచారం సేకరించి మరొక పుస్తక రూపంలో తీసుకొస్తే బాగుంటుందని సుందర సాయి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, సర్పంచ్ నాతి లావణ్య, కుమార్‌రాజా దంపతులు ఆలమూరు ఖ్యాతిని వివరించారు. కామవరపు మల్లికార్జునరావు మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా ప్రముఖుల వివరాలు సేకరించి ఒక పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. తన శిష్యుడు గొడవర్తి శ్రీనివాసు దీనికి బాధ్యత వహించడం తనకు మరింత ఆనందదాయకంగా ఉందన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులకు నిర్వాహకులు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, గాయకులు పెండ్యాల సుబ్బారావు, వుడతా వెంకటేశ్వర్లు, వాసా వెంకట దుర్గాప్రసాద్, కే.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - మండపేట

స్థానిక శ్రీ జవహర్ లాల్ మున్సిపల్ హై స్కూల్ 1990-91బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఏడిద శివార్లలో ఆదివారం ఉత్సాహంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన బాల్య మిత్రులందరూ ఒక్కచోట సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేయడానికి తీర్మానించారు. తక్షణ సాయంగా ఇటీవల మృతి ఇద్దరు స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గనిశెట్టి శ్రీనివాసరావు, అధ్యక్షులుగా వంక వరశేఖరప్రసాద్, ఉపాధ్యక్షులుగా గండి స్వామిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కోడూరి సూర్యభాస్కరరావు, కోశాధికారిగా కనపర్తి సుబ్రహ్మణ్యం కార్యవర్గ సభ్యులుగా పసలపూడి మధు సూదనరావు, పిట్టా రాజుబాబు, ఇల్లురి సుందర రాజు, మందపల్లి చంద్ర శేఖర్, మల్లువలస గణపతి, లీగల్ అడ్వైజర్‌గా వంక సురేష్‌లను ఎన్నుకొన్నారు.

బాబుతోనే రాష్ట్ర ప్రగతి : ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. వికె రాయపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ రాయపురం ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు అధ్వర్యంలో పంచాయతీ వార్డ్ సభ్యులు సహ వందలాది వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వీరందరికీ పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. అనంతరకాయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో ప్రకటించిన తొలి మేనిఫెస్టోలోని ఐదు పథకాలు అత్యద్భుతంగా ఉన్నాయన్నారు. వీటిపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లోనూ నష్టపోయిందన్నారు. మళ్లీ రాష్ట్రం ప్రగతి పథాన పయనించాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కాకినాడ పార్లమెంటరీ తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులచౌదరి, మండల అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, కుర్రా నారాయణ స్వామి(రాజు), క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో ఎంఎల్ఎ చినరాజప్ప

ఎంఎల్ఎ సతీష్‌కుమార్‌కు సన్మానం

తాళ్ళరేవు : మండల క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా దడాల సాల్మన్ రాజ్ (శ్రీనివాసరావు)ను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఎపి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి సామ్యూల్ సాగర్‌ను ఆదివారం గజమాలతో ఘనంగా సత్కరించారు. జెడ్‌పిటిసి సాగర్ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ మండల అధ్యక్షునిగా నియమితులైన సాల్మన్ రాజును ఎంఎల్ఎ పొన్నాడ అభినందించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రిస్టియన్ల అభివద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి ఎంతో సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పంపన జాన్ ప్రసాద్, మల్లాడి అప్పారావు, దడాల మహేంద్ర విజయ్ కుమార్, విక్టర్, దేవిడ్ రాజు, జాన్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లికి జయహో జగన్ యాత్ర

గండేపల్లి: ఎంఎల్‌సి రఘురాజు చేపట్టిన జయహో జగన్ యాత్ర ఆదివారం నీలాద్రిరావుపేటకు చేరుకుంది. వీరికి జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఘన స్వాగతం పలికారు. సంఘీభావంగా కొంత దూరం పాదయాత్ర చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి జగన్ మళ్లీ సిఎం కావడం ముఖ్యమన్నారు. ఎంఎల్ఎ రఘురాజు శ్రీకాకుళం నుంచి సుమారు 800 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రతి కుటుంబానికి రూ.లక్షల మేర సాయం అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రఘురాజు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రతి గ్రామంలో ప్రతి నియోజకవర్గంలో ప్రజలు నాయకులు సంఘీభావం తెలపడం జగన్మోహన్ రెడ్డి గెలుపునకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కందులు చిట్టిబాబు, ఒబిన్ని వీరబాబు, బండారు రాజా, ఒమ్మి రఘురాం పాల్గొన్నారు.

వినోదాత్మకంగా 'ఐ హేట్ లవ్'

ప్రజాశక్తి-అమలాపురం

వినోదాత్మకంగా ఐ హేట్ లవ్ సినిమాను నిర్మించామని దర్శకుడు వెంకటేష్ తెలిపారు. కోనసీమ ప్రాంతంలో మారుమూల గ్రామమైన నేదునూరులో రావి ఫౌండేషన్ ద్వారా ఉత్తమ వైద్యం, ఉన్నత విద్య ఉచితంగా అందిస్తూ నైపుణ్యం కలిగిన యువతను ఆయా రంగాల్లో స్థిరపడేలా ప్రోత్సహిస్తున్నారు డాక్టర్ రవిబాల. ఇప్పుడు డాక్టర్ రవి బాల ప్రొడక్షన్స్ బ్యానర్ స్థాపించి నేదునూరు గ్రామవాసి వెంకటేష్‌కు దర్శకునిగా 'ఐ హేట్ లవ్' 'నేను ప్రేమలో పడ్డాను' ట్యాగ్‌లైన్‌తో సినిమాను నిర్మించారు. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఆదివారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సినిమా నటీనటులు దర్శకులు నిర్మాత ఇతర సాంకేతిక పాల్గొన్నారు. కోనసీమ సంస్కతి, సంప్రదాయాలతో చక్కని కథలో అమర్చి మంచి సినిమా చూశాను అనే భావన ప్రేక్షకుల్లో కలిగించేలా వినోదాత్మకంగా మలిచామని దర్శకులు వెంకటేష్ తెలిపారు. ప్రేక్షకునికి మంచి రుచికరమైన కోనసీమ విందు భోజనం చేసిన అనుభూతి కలుగుతుందన్నారు. ఈ చిత్రం ద్వారా సుబ్బు, శ్రీవల్లి హీరో హీరోయిన్లగా పరిచయం అవుతున్నారు. పెద్దపల్లి రోహిత్ (పిఆర్) సంగీతాన్ని అందించారు. జబర్దస్త్ హాస్యనటులు తదితరులు ఈ చిత్రంలో నటించారు. ఈ కార్యక్రమంలో సినీ నటులు తేజ, భద్రాజీ, త్రిమూర్తులు స్టిల్ ఫోటోగ్రఫీ డిజిటల్ రవి, స్వామి వివేకానంద యువత సభ్యులు రాము, కృష్ణ, ముఖేష్, బద్రి, వెంకటేష్, నాగేశ్వరావు, పవన్ అర్జున్, చరణ్, కౌశిక్, పవన్ తేజ, సాయి, రామకృష్ణ పాల్గొన్నారు.

సహకార సంఘాలతో రైతులకు భరోసా

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సహకార సంఘాలు రైతన్నల ఆర్థిక భరోసా కేంద్రాలని పిఎసిఎస్ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయ ఆవరణలో 70వ సహకార వారోత్సవాలను పురస్కరించుకొని పథకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘ డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సహకార వ్యవస్థ ప్రారంభించి 70 ఏళ్ల కాలంలో లక్షలాది మంది రైతులకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ సహకార అధికారి జివిఎన్‌వి.ప్రసాద్, సిఇఒ జ్యోతుల నాగసత్య శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు దాసరి రమేష్, సిరిపరపు రాజేష్, కర్రి పోల రామాంజనేయులు, ఎర్రబుల్లి వీర్రాజు, వైసిపి నాయకులు బదిరెడ్డి గోవిందబాబు, జువ్విన వీర్రాజు, బుద్ధ సూర్య ప్రకాష్, సూతి వీర కృష్ణప్రసాద్, సహకార సంఘం ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ ఉన్నారు.

సత్యవేణికి న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట రెండవ వార్డుకు చెందిన కాకరపల్లి సత్యవేణి జగనన్న ఇంటి స్థలం ఇచ్చినా, గృహ నిర్మాణానికి అధికారులు సహకరించడం లేదని తక్షణమే ఆమెకు న్యాయం చేయాలని ఆదివారం సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు పలు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. సమస్యపై పలుమార్లు జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ లో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్ ఇంటి స్థలాన్ని ఆక్రమించాడని, తక్షణమే చర్యలు తీసుకుని బాధితురాలు న్యాయం చేయాలన్నారు. లేకుంటే పలు సంఘాలతో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జిల్లా రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు రాయుడు మోజేష్ బాబు, సందీప్ రాజు, కౌన్సిలర్ పితాని కృష్ణ, మాల మహానాడు నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కి సమస్యను వివరిస్తున్న పలు సంఘాల నాయకులు